పాఠశాలల్లో అసంపూర్తిగా పనులు

- 30 శాతం మాత్రమే యూనిఫామ్‌లు సిద్ధం
- అధ్వానస్థితిలో మరుగుదొడ్లు

ఘన్‌పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో మరమ్మతుకు నోచుకోని మరుగుదొడ్లు

డిచ్‌పల్లి, జూన్ 12 : పాఠశాలలు పునః ప్రారంభమైనా మరమ్మతు, అభివృద్ధి పనులు పూర్తి కాలేదు. పాఠశాలలు బుధవారం ప్రారంభమైన సందర్భంగా పాఠశాలల్లో 'నమస్తే తెలంగాణ' చేపట్టిన ఫీల్డ్ విజిట్‌లో పలు సమస్యలను గుర్తించింది. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి, మరమ్మతు పనులు చేపట్టేందుకు అధికారులు 44 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో 8 పాఠశాల్లో వంద శాతం అభివృద్ధి, మరమ్మతు పనులు పూర్తయ్యాయి. మిగతా పాఠశాలల్లో 60 శాతం మేర పనులు పూర్తికాగా.. మిగిలినవి కొనసాగుతున్నాయి. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే అభివృద్ధి పనులను పూర్తిచేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించినా చాలా పాఠశాలల్లో పనులు పూర్తి కాలేదు. డిచ్‌పల్లి మండలంలోని ఘన్‌పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో అభివృద్ధి పనులు ఇంకా పూర్తికాలేదు. టాయిలెట్ల మరమ్మతు పనులు పాఠశాల ప్రారంభమైన తర్వాత మొదలుపెట్టారు. పాఠశాలలో తాగునీరు లేకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచి బాటిళ్లలో నీటిని వెంట తెచ్చుకుంటున్నారు. బోరుమోటరు పని చేయకపోవడంతో పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ ద్వారా పాఠశాలకు నీళ్లు అందిస్తున్నారు. మండలంలోని 63 పాఠశాలల్లోని విద్యార్థుల కోసం 5,399 యూనిఫామ్‌లు లక్ష్యం కాగా.. ఇప్పటివరకు కేవలం 1,620 (30 శాతం)మాత్రమే పూర్తయ్యాయి. ఈ విషయమై ఐకేపీ ఏపీఎం రజితను సంప్రదించగా. ప్రస్తుతం ధర్మారం(బీ), ఘన్‌పూర్, ఇస్లాంపుర కాలనీలో ఇంటి వద్దనే యూనిఫామ్‌లు కుడుతున్నారని, త్వరలోనే లక్ష్యాన్ని పూర్తి చేసి విద్యార్థులకు అందజేస్తామని తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలకు పుస్తకాల సరఫరా పూర్తయ్యిందని ఎంఈవో రాజగంగారాం తెలిపారు. పాఠశాలలు ప్రారంభమైన తొలిరోజే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేశారు.

ఈదురుగాలులకు కూలిన చెట్టు

నందిపేట్, జూన్ 12: మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. బలబైన ఈదురుగాలులకు చెట్లు నేల కూలాయి. విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది. అక్కడక్కడ పిడుగులు పడ్డాయి. సుమారు గంటన్నరపాటు వర్షం పడింది. లక్కంపల్లి గ్రామంలో ఈదురుగాలులకు వైర్లపై చెట్టు పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

కోటగిరిలో జోరు వర్షం

కోటగిరి, జూన్ 12 : మండలకేంద్రంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కోటగిరిలో నిర్వహించిన వారాంతపు సంతకు వచ్చిన ప్రజలు భారీ వర్షంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ మాస్త ప్రభాకర్

మాక్లూర్, జూన్12: వానకాలం ప్రారంభమైనందున వైద్యులు, ఏఎన్ఎంలు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ మాస్త ప్రభాకర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఎంపీడీవో జైక్రాంతితో కలిసి తనిఖీ చేశారు. మలేరియా, డెంగీ ప్రబలకుండా గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట మండల కోఆప్షన్ సభ్యుడు హైమద్, వైద్యుడు ఆనంద్, సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆర్మూర్‌టౌన్, జూన్12: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 26వ వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ రాజుకు కాలనీవాసులు బుధవారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో మురికి కాలువలు, విద్యుత్ స్తంభాలు లేవన్నారు. సరైన రోడ్లు లేక రాకపోకలకు ఇబ్బందిగా మారిందని అన్నారు. వీధి దీపాలు లేవని పేర్కొన్నారు.

విద్యార్థిని మృతికి సంతాపం

రెంజల్, జూన్ 12: మండలంలోని కందకుర్తి ఉర్దూ మీడియం పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని అస్రాబేగం(13) ఈనెల 9న అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం పాఠశాలలో ప్రార్థన సమయంలో రెండు నిమిషాలు సంతాపం పాటించారు. హెచ్ఎం అబ్బుల్ కరీం, ఉపాధ్యాయుడు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పాఠశాలల పునః ప్రారంభం

- విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ

ఆర్మూర్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

నందిపేట్‌లో పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జూన్ 12 : జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు బుధవారం పునః ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు.. ఉపాధ్యాయులతో కలిసి ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించాలని, పరీక్షల్లో 75 శాతానికి పైగా మార్కులు వచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. పాఠశాలల ఆవరణలో రాత్రివేళలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో దుర్గాప్రసాద్, డీఆర్డీవో సాయాగౌడ్, జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ రజితాయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

నందిపేట్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్, మాక్లూర్ జడ్పీహెచ్‌ఎస్ (ఉర్దూ మీడియం)లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పంపిణీ చేశారు. నందిపేట్‌లో ఎంపీపీ సంతోష్, జడ్పీటీసీ యమునా ముత్యం, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, పాల్గొన్నారు. మాక్లూర్‌లో ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఎంపీడీవో జైక్రాంతి తదితరులు పాల్గొన్నారు. మోర్తాడ్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఎంపీపీ లోలపు గౌతమీ సుమన్ పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు సత్యనారాయణ, ఆంజనేయులు, ఎంపీడీవోలు తిరుమల, రాజాశ్రీనివాస్, ఎంఈవో ఆంధ్రయ్య, ఏపీఎం కుంటగంగారెడ్డి పాల్గొన్నారు. మాక్లూర్ మండలంలోని గుత్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ మాస్త ప్రభాకర్, తహసీల్దార్ షబ్బీర్ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల(రాంమందిర్)లో విద్యార్థులకు అదనపు కలెక్టర్ అంకిత్, ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఆర్డీవో రాజాగౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజు, చైర్‌పర్సన్ లావణ్య పాల్గొన్నారు. ఏర్గట్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, దుస్తులను ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ ఎండీ యూసుఫ్, ఎంపీటీసీ సభ్యుడు జక్కని మధుసూదన్ పంపిణీ చేశారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీవో శ్యామ్, హెచ్ఎం కృష్ణమాచారి, వీడీసీ అధ్యక్షుడు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. భీమ్‌గల్ మండలంలోని జాగిర్యాల్ ఎంజీ తండా, రూప్లా తండా, పిప్రి గ్రామాల్లో విద్యార్థులకు పుస్తకాలను ఎంపీడీవో సంతోష్ కుమార్ అందజేశారు.

మోర్తాడ్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

ఏర్గట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందజేస్తున్న ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి

రెంజల్ మండలంలోని పలు పాఠశాలల్లో ఎంపీపీ రజిని, జడ్పీటీసీ విజయాసంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో గణేశ్‌రావుకుల కర్ణి పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేల్పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలు అందజేసినట్లు ఎంపీడీవో బాలకిషన్ తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ హరిత, సభ్యులు పాల్గొన్నారు. చందూర్ మండల కేంద్రంలో ఏకరూప దుస్తులు, నోట్ బుక్కులను ఎంపీపీ లావణ్యా రాంరెడ్డి, వైస్ ఎంపీపీ దశాగౌడ్, ఎంపీవో తారాచంద్, సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్.. ఉపాధ్యాయులతో కలిసి అందజేశారు. కోటగిరి మండల కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలను ఎంపీపీ వల్లెపల్లి సునీతా శ్రీనివాస్.. హెచ్ఎం చంద్రకళతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొట్టం మనోహర్, ఏపీఎం బస్వంత్, గిర్దావర్ సయ్యద్ పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బీ) జడ్పీహెచ్ఎస్‌లో పాఠ్య పుస్తకాలను ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ కొసరాజు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజలింగం, హెచ్ఎం సంధ్యానాయక్, పీడీ విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు. సుద్దపల్లిలో మాజీ సర్పంచ్ రూపా సతీశ్‌రెడ్డి నోట్‌బుక్కులను పంపిణీ చేశారు. ధర్పల్లి మండలం సీతాయిపేట్ ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీవో బాలకృష్ణ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. రూరల్ మండలంలోని గుండారం, ఖానాపూర్‌లో ఆర్డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్ అనిరుధ్, కార్పొరేటర్ కోర్వ లలితా గంగాధర్, ఎంపీటీసీ అంకల గంగాధర్ ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. మల్కాపూర్(ఏ), జలాల్‌పూర్, ధర్మారం, ధర్మారం తండా, లక్మాపూర్, లింగి తండా, ముత్తకుంట గ్రామాల్లో ఐకేపీ డీపీఎం సంధ్యారాణి, ఏపీఎం మహేశ్‌కుమార్, ఎంపీటీసీ శాంత విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. రుద్రూర్ మండల కేంద్రంలోని ఎంఆర్‌సీలో జడ్పీటీసీ సభ్యుడు నారోజి గంగారాం, ఎంపీపీ అక్కపల్లి సుజాతా నాగేందర్, ఎంఈవో శాంతకుమారి, ఎంపీడీవో సురేశ్‌బాబు, తహసీల్దార్ వెంకటేశం, ఐకేపీ ఏపీఎం భాస్కర్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. పోతంగల్ మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ వల్లెపల్లి సునీతాశ్రీనివాస్ ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఎంపీటీసీ కేశవీరేశం, తహసీల్దార్ మల్లేశ్, ఎంపీవో మారుతి, హెచ్ఎం శైలజ పాల్గొన్నారు.

కోటగిరి పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఎంపీపీ వల్లెపల్లి సునీత

చందూర్ ఉన్నత పాఠశాలలో ఏకరూప దుస్తులను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రుద్రూర్ పాఠశాలలో..

బోధన్‌లో మహా అన్నదానం

ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కమ్మసంఘం ప్రతినిధులు, అభిమానులు

బోధన్, జూన్ 12: ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పట్టణంలో మహా అన్నదానం, విజయోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎన్టీఆర్ అభిమాన సంఘం, కమ్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మహా అన్నదానం కార్యక్రమం ప్రారంభించారు. 6 వేల మందికి శాఖాహార, మాంసాహార భోజనాలు వడ్డించామని నిర్వాహకులు తెలిపారు. అంతకుముందు పటాకులు కాల్చి విజయోత్సవం నిర్వహించారు. పెద్ద సైజ్ స్క్రీన్‌పై చంద్రబాబు ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని టెలికాస్ట్ చేశారు. కార్యక్రమంలో కమ్మ సంఘం అధ్యక్షుడు పల్లెంపాటి శివన్నారాయణ, కమ్మ సంఘం ప్రతినిధులు హరనాథ్‌బాబు, పి.గాంధీ, ఈవీ రంగారావు, పావులూరి వెంకటేశ్వరరావు, రామ్మోహన్‌రావు, రావెళ్ల శ్రీనివాస్, కొండలు, టీడీపీ జిల్లా నాయకులు గోపాల్‌రెడ్డి, సీహెచ్‌వీ హన్మంత్ రావు, ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

కమ్మర్‌పల్లిలో విద్యార్థిని సన్మానిస్తున్న ఎంపీపీ గౌతమీ సుమన్

మోర్తాడ్/బాల్కొండ, జూన్12: పదో తరగతిలో పది జీపీఏ సాధించిన కమ్మర్‌పల్లి ఉన్నతపాఠశాల విద్యార్థి ఎండీ ఫైజాన్‌ను ఆ పాఠశాలలో బుధవారం ఎంపీపీ గౌతమీసుమన్ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు సాయన్న, కోఆప్షన్‌సభ్యుడు పాషా, జీపీ కార్యదర్శి శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10 జీపీఏ సాధించిన సొన్న హర్షికను, మండల విద్యాధికారి రాజేశ్వర్‌ను సన్మానించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

వినాయక్‌నగర్, జూన్ 12 : జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మను బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు బుధవారం దహనం చేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ ఠాకూర్, కార్యదర్శి గాజుల దయానంద్, సహ కార్యదర్శి ధాత్రిక రమేశ్ మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయాన్ని దర్శించుకొని వస్తున్న భక్తుల బస్సుపై దాడి చేసి, వారి మృతికి కారణమైన ఉగ్రవాదులది క్రూరమైన చర్య అన్నారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **16న కవిసమ్మేళనం** –సుభాష్‌నగర్, జూన్ 12 : శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా జిల్లాకేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవనంలో ఈనెల 16వ తేదీన సాయంత్రం 5 గంటలకు జిల్లా స్థాయి ద్విభాష కవి సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు శ్రీశ్రీ వర్ధంతి నిర్వహణ కమిటీ సమన్వయ కర్త సిర్పలింగం తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి వక్తగా ఓయూ ప్రొఫెసర్ ఖాసీం తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. కవి సమ్మేళనంతో పాటు శ్రీశ్రీ సినీ గాన విభావరి ఉంటుందని, సాహితీ ప్రియులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో తిరుమల శ్రీనివాస్ ఆర్యా తదితరులు పాల్గొన్నారు.
- **రేపు ఎగ్జిబిషన్ ప్రదర్శన ముగింపు -** సుభాష్‌నగర్, జూన్ 12 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో కొనసాగుతున్న ఎగ్జిబిషన్ ఈనెల 14న ముగుస్తుందని సొసైటీ కార్యదర్శి బంటు రాజేశ్వర్ బుధవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.
- **జీసీడీవో డిప్యుటేషన్ రద్దు -** ఖలీల్‌వాడి, జూన్ 12 : సమగ్ర శిక్ష అభియాన్‌లో రాష్ట్రవ్యాప్తంగా జీసీడీవో (గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) లుగా కొనసాగుతున్న అధికారుల డిప్యుటేషన్ రద్దయ్యింది. ఇందుకు సంబంధించిన జీవో ఈనెల 10వ తేదీన విడుదలైంది. మూడు సంవత్సరాల పదవీ కాలం పూర్తి కావడంతో డిప్యుటేషన్‌ను రద్దు చేసి తిరిగి మాతృవిభాగంలో చేరాలని విద్యాశాఖ ఆదేశాలిచ్చింది. ఇందులో భాగంగా నిజామాబాద్ జీసీడీవోగా ఉన్న వనిత తిరిగి ప్రధానోపాధ్యాయురాలిగా కొనసాగనున్నారు. ఇటీవలే ఆమెను ఎఫ్ఏవో పోస్ట్ నుంచి కూడా రిలీవ్ చేశారు. నూతన అధికారిగా కొత్తవారికి బాధ్యతలను అప్పగించాల్సి ఉన్నది.
- **23న ఇంటర్ విద్యార్థులకు స్పాట్ కౌన్సెలింగ్-** సుభాష్‌నగర్, జూన్ 12: తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురంలో ఉన్న చంద్రశేఖర సరస్వతీ విశ్వ విద్యాలయం వారు నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ఈనెల 23న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలంగాణ గాయత్రీ ధార్మిక సాహిత్య సంస్థ ప్రతినిధులు ప్రకాశ్‌శర్మ, అరుణ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన బ్రాహ్మణ విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు గంగస్థాన్‌లోని ఉత్తర తిరుపతి క్షేత్రంలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు జూన్16వ తేదీలోగా 9866765439 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు.
- **కోటగిరి 'కస్తూర్బా'లో విద్యార్థుల చేరిక-** కోటగిరి, జూన్ 12 : కోటగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరుతున్నారు. ఇప్పటికే పాఠశాలలో 200 మంది విద్యార్థులు భర్తీ అయ్యారు. బుధవారం పాఠశాల పునఃప్రారంభం కాగా.. పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు తరలివచ్చారు.
- **దరఖాస్తుల ఆహ్వానం-** కంఠేశ్వర్, జూన్ 12 : మాక్లూర్ మండలకేంద్రంలోని మినీ గురుకులంలో ఒకటో తరగతిలో అడ్మిషన్లతోపాటు రెండో తరగతిలో (1), ఐదో తరగతిలో (6) సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఎస్టీ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని రీజినల్ కో-ఆర్డినేటర్ సంపత్ కుమార్ బుధవారం తెలిపారు. మాక్లూర్ మండల విద్యార్థినులకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని తెలిపారు.
- **అధ్యాపకులుగా నియామకానికి ...** శక్కర్‌నగర్, జూన్ 12: బోధన్ పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాలలో అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల ప్రిన్సిపాల్ పద్మజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిన తెలుగు, బాటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు బోధించడానికి అర్హులైన మహిళా అభ్యర్థినులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీతో పాటు అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. అర్హులై, ఆసక్తి కలిగిన వారు ఈనెల 14లోపు సంప్రదించాలని పద్మజ కోరారు.
- **అంబం వీడీసీ ఎన్నిక -** రుద్రూర్, జూన్ 12 : మండలంలోని అంబం గ్రామంలో గ్రామస్తుల సమక్షంలో కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రెంజర్ల గంగారాం, కార్యదర్శిగా గంగాలి రాములు, క్యాషియర్‌గా ఆసం రాములు, ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్, సాయిరాం, సలహాదారులుగా అత్కూరి మహేశ్, శానం హన్మాండ్లు, సాయిలు, పట్టెపు రాములు, మంత్రి గంగారాం, సభ్యులుగా తాహెర్, అల్లావుద్దీన్, దొండ సురేందర్, పోశెట్టిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.
- **15వ తేదీన తైబజార్ వేలంపాట -** ఆర్మూర్‌టౌన్,జూన్12: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 15న వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్మూర్‌తో పాటు పెర్కిట్, మామిడిపల్లికి సంబంధించిన తైబజార్ వేలం వేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

'మిషన్ భగీరథ' సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

రుద్రూర్/ సారంగపూర్/ కోటగిరి/ పొతంగల్, జూన్ 12 : మిషన్ భగీరథ నల్లాల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అధికారులు.. పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్‌లో కొనసాగుతున్న మిషన్ భగీరథ, పంచాయతీ నల్లాల సర్వేను డీఎల్పీవో సాయిబాబా బుధవారం పరిశీలించారు. చిక్కడ్‌పల్లిలో ఎంపీవో సాయిలుతో పాటు కార్యదర్శి రాధిక సర్వే చేపట్టారు.

నిజామాబాద్ రూరల్ మండలంలోని శ్రీనగర్, ఆకుల కొండూర్‌లో చేపడుతున్న సర్వేను డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీడీవో మధురిమ పరిశీలించారు. మిషన్ భగీరథ నల్లాల ద్వారా సరిపడా నీరు అందుతున్నాయా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. తప్పులు లేకుండా సర్వే చేసి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఉమా, ప్రియాంక, కారోబార్ రంజిత్‌రెడ్డి ఉన్నారు.

కోటగిరి, పొతంగల్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటా తిరిగి మిషన్ భగీరథ నల్లాలు, జీపీ తాగునీటి సౌకర్యంపై సర్వే చేపడుతున్నారు. మొబైల్ యాప్ ద్వారా సర్వే చేస్తూ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సుద్దులంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కవిత, హంగర్గాలో కృష్ణమోహన్ బుధవారం సర్వే చేపట్టారు.

సులేమాన్‌నగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న డీఎల్పీవో సాయిబాబా

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ చెక్ చేయించాలి

పాఠశాల బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ

ఆర్మూర్‌టౌన్, జూన్12: ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల బస్సులను తప్పకుండా ఫిట్‌నెస్ చెక్ చేయించాలని ఎంవీఐ వివేకానందరెడ్డి సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో బుధవారం పలు విద్యాసంస్థల బస్సుల కండిషన్‌ను పరిశీలించారు. అన్ని విద్యాసంస్థల బస్సులను ఫిట్‌నెస్ చేయించాలని, లేని పక్షంలో పాఠశాలల గుర్తింపు రద్దు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. బస్సులు నడిపే డ్రైవర్లకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని అన్నారు.

వాహనాల తనిఖీ

భీమ్‌గల్, జూన్ 12: మండల కేంద్రంలో వాహనాలను ఎంవీఐ వివేకానందరెడ్డి తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు.

పాఠశాల పనుల పరిశీలన

బాల్కొండ, జూన్ 12: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ అంకిత్ బుధవారం పరిశీలించారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, ఎంఈఓ బట్టు రాజేశ్వర్, ఉపాధ్యాయ బృందం, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మరమ్మతులు వేగవంతం చేయాలి

నవీపేట, జూన్ 12: మండలంలోని పలు పాఠశాలల్లో మరమ్మతు పనులను వేగవంతం చేయాలని నిజామాబాద్ పంచాయతీరాజ్ ఈఈ శంకర్ నాయక్ గుత్తేదారులను సూచించారు. బుధవారం మండల కేంద్రంలో బాలుర పాఠశాల, స్టేషన్ ఏరియా ఆశనగర్ తండాలో కొనసాగుతున్న మూత్రశాల, మరుగుదొడ్లు, వాటర్ ట్యాంక్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ ఈఈ రాజయ్య, ఏఈ శ్రావణ్‌కుమార్, గుత్తేదారు ఉన్నారు.

'ఆర్మూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాజీనామా చేయాలి'

ఆర్మూర్‌టౌన్, జూన్12: కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆర్మూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్నా తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారుఉ. అధికార పార్టీకి చెందిన వైస్ చైర్మన్ దొంగ వాహనాలు తీసుకొని స్క్రాప్ చేస్తున్నారని అన్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు కూడా నమోదైందని అన్నారు. పోలీసులు విచారణ జరిపి బాధితులకు వాహనాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఏర్గట్ల, జూన్ 12: మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను తహసీల్దార్ ఎండీ యూసుఫ్ పట్టుకొని సీజ్ చేశారు. ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో కలిసి వెళ్లి ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు. తొర్తిలో బుధవారం ఉదయం 15 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేశామని తెలిపారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ సదానంద్, సిబ్బంది ఉన్నారు.

వాహనాదారులకు జరిమానా

నవీపేట, జూన్ 12: రోడ్డుపై ట్రాఫిక్ కు అంతరాయం కలిగించిన ఎనిమిది మంది వాహదారులకు బుధవారం జరిమానా విధించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని బాసర రోడ్డుపై వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న పలువురికి రూ. 100 చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు.

చెక్ పోస్టు తనిఖీ

రెంజల్, జూన్ 12: మండలంలోని కందకుర్తి సరిహద్దులో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టును బుధవారం ఎస్సై సాయన్న తనిఖీ చేశారు. ఈనెల 17న బక్రీద్ పండుగను దృష్టిలో ఉంచుకొని పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గోవధ నిషేధ చట్టాలపై ఇప్పటికే సాటాపూర్ పశువుల వ్యాపారులకు సూచనలు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫెస్టిసైడ్స్ విక్రయాలు నిషేధం

ఉత్తర్వులను అందిస్తున్న ఏవో లక్ష్మీకాంత్‌రెడ్డి

రెంజల్, జూన్ 12: మండలంలోని సాటాపూర్ గ్రామంలోని వీవన్ అగ్రో కెమికల్స్, ఫెస్టిసైడ్ దుకాణాన్ని బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారి పరిగె లక్ష్మీకాంత్‌రెడ్డి తనిఖీ చేశారు. దుకాణంలో ఎఫ్ఎంసీ, బేయర్, కార్టేవా, డౌవ్, నాగార్జున ఆగ్రో కెమికల్స్ కంపెనీలకు ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేనందున రూ.8,72.419 విలువ గల స్టాక్ విక్రయాలను నిలిపివేస్తూ ఉత్తర్వులను యజమానికి అందించారు. గడువులోగా ప్రిన్సిపల్ సర్టిఫికెట్‌ను అందించాలని లేని పక్షంలో మందులను సీజ్‌చేసి, కేసులు నమోదు చేస్తామని దుకాణం యజమాని శ్రీశైలం, టెక్నికల్ పర్సన్ మాధవిని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థి

బాల్కొండ, జూన్ 12: కిసాన్‌నగర్‌లోని నర్సింహా కుటుంబానికి 2006-07 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.30 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో తమ స్నేహితుడు నర్సింహ మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు డబ్బులు అందజేశామన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I,CHANDRAKANTH S/o SHANKAR RAO (Old Name) R/o. H.No. 6-14-174,Namdevwada ,Nizamabad Town and Mandal ,District Nizamabad State Telangana. Changed My Name As SUGAVE CHANDRAKANTH S/o SHANKAR RAO (New Name)

CHANGE OF NAME
I, SAINATH S/o CHANDRAKANTH (Old Name) R/o. H.No.6-14-174, Namdevwada ,Nizamabad Town and Mandal ,District Nizamabad State Telangana. Changed My Name As SUGAVE SAINATH S/o SUGAVE CHANDRAKANTH (New Name)

CHANGE OF NAME
★I, SHEMBARI VENKAT RAJU , H.NO: 1-111/1,KOTHAPALLY,MUPKAL(M), NIZAMABAD(D),CHANGED MY SURNAME / NAME AS SEMBERI VENKAT REDDY
NTZ-324960

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును